

## శివయ్య సేవలో నటి శ్రీయ

శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని గురువారం సినీ నటి శ్రీయ కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. వారికి అధికారులు, బిజెపి నాయకు లు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న ఆమెకు మృత్యుం జయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వ చనాలు అందించారు. బిజెపి నాయకులు స్వామి అమ్మవార్ల ప్రసాదాలను అందించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లను ఆలయ పిఆర్ఓ దుర్గా ప్రసాద్, బిజెపి నాయకులు చందురాయల్, కొండేటి గోపాల్‌లు పర్యవేక్షించారు. శ్రీయ తిరుపతి జిల్లాలోని తిరుమలేశ్వరుని సన్నిధిలో దర్శనానికి వచ్చిన ప్రతిసారి శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకోవటం ఆనవాయితీగా వస్తుంది.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అనుమానాస్పద స్థితిలో ప్రేమజంట మృతి

నాయుడుపేట మే 29 ప్రభాతవార్త:



పట్టణంలోని ఓ లాడ్జిలో జమ్మల సుబ్రమణ్యం(35), శిరీష(29) అనే ప్రేమజంట అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన గురువారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం గ్రామానికి చెందిన జమ్మల సుబ్రమణ్యం, శిరీషలు కలిసి నాయుడుపేట పట్టణంలోని లాడ్జిలో రూమ్ తీసుకొన్నారు. సాయంత్రమైన రూమ్‌లోనుండి ఎవరు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది తలుపులుతీసి చూసేసరికి రూమ్‌లో ఆ ప్రేమ జంట అనుమానాస్పదంగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెంది ఉండటాన్ని గుర్తించి నాయుడుపేట పోలీసులకు సమాచారం మిచ్చారు. పోలీసులు మృతదేహాలను పరిశీలించి పంచనామా నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పచ్చదనం పెంపొందించేలా

# 'శ్రీవారి వననిధి'

### అన్నమయ్య సంకీర్తనలు యూట్యూబ్‌లో అందుబాటులో ఉండాలి -టిటిడి ఈఓ శ్యామలరావు



తిరుమల,మే 29ప్రభాతవార్తప్రతినిధి:

శేషాచలంకొండల్లో, తిరుమలలోనూ పచ్చదనాన్ని మరింత పెంచేలా చూడాలని, ఇందుకోసం వెంకన్నను దర్శించుకున్న భక్తులకు "శ్రీవారి వననిది"ద్వారా ఒక మొక్కను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. అన్నమయ్య సంకీర్తనలలో ఇప్పటికే బాగా పాపులర్ అయిన వాటిని ముందుగా పొందుపరచిన ,దశలవారీగా అన్ని సంకీర్తనలను అందులో పొందుపరచాలని ఆయన సూచించారు. గురువారం సాయంత్రం పద్మావతిఅతిథిగృహంలో హెచ్‌డిపిపి, శ్రీనివాసకల్యాణంప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు,ఎస్వీరికార్డింగ్‌ప్రాజెక్ట్, పురాణ ఇతిహాస్ ప్రాజెక్ట్, ఎఫిక్‌స్టడీస్ తదితర ప్రాజెక్ట్ అధికారులతో సమీక్షసమావేశం ఈఓ శ్యామలరావు నిర్వహించారు.ఈ సమావేశంలో టిటిడిజెఈఓ వీరబ్రహ్మం, డిపిపి కార్యదర్శి శ్రీరామ్‌రఘునాథ్, ప్రత్యేక అధికారి రాజగోపాల్, అదనపు కార్యదర్శి శ్రీరామ్‌గోపాల్, అన్నమాచార్యప్రాజెక్టు ప్రత్యేక అధికారి మేడసాని మోహన్, డైరెక్టర్ లత, డిపిపి ప్రత్యేక అధికారి బిఆర్ రామానందతీర్థాచార్యులు, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు. విద్యార్థుల్లో దైవభక్తి, నైతిక విలువలు, క్రమశిక్షణ, ఉమ్మడికుటుంబ వ్యవస్థ తదితర అంశాలపై యువతకు శిక్షణ ఇచ్చేలా ఇప్పటినుండే ప్రణాళికలు తయారు చేయాలన్నారు.

# మధురమలలో గజరాజుల తిష్ఠ

### మామిడి ధ్వంసం -భయాందోళనలో రైతులు

చౌడేపల్లి, మే 29 ప్రభాతవార్త

మధురమల అడవిలో కారసేనుకుంట వద్ద గజరాజులు తిష్ట వేయడంతో చుట్టుపక్కల రైతులు భయాందోళన చెందుతున్నారు. బుధవారం రాత్రి నుంచి పంట పొలాలను ధ్వంసం చేస్తూ, ఘీంకార ధ్వనులతో ఆ ప్రాంత వాసుల గుండెల్లో గుబులు పట్టిస్తున్నాయి. మధురమల అటవీ ప్రాంతం సమీపంలోని బాలసముద్రం, చుక్కావారిపల్లి, తొప్పిరెడ్డిపల్లి, కొత్తపల్లి, ముదిరెడ్డిపల్లి, మేకలచిన్నేపల్లి తదితర ప్రాంతాలకు చెందిన రైతుల పంట, పొలాల్లోకి బుధవారం రాత్రి ఏనుగుల గుంపు చొరబడి మామిడితోటలు, మిరప, బీర వంటి వాణిజ్య పంటలను ధ్వంసం చేసాయి. బాలసముద్రం రమణప్పకు చెందిన మామిడి తోటలో దాదాపు 20చెట్లు, మామిడి కాయలు, మాదిరాజు వెంకట్రమణరాజు, తదితరులకు చెందిన మామిడిని తోటల్లో వున్న వేలాది రూపాయలు విలువ చేయు డ్రిఫ్ పరికరాలను పాడు చేసాయి. వ్యవసాయం జూదంలా మారుతున్న ప్రస్తుత సమయంలో పంటలు చేతికొచ్చి రుణాలను తీర్చుదామనుకొంటే ఏనుగులు తమ కొంప ముంచుతున్నాయని రైతులు వాపోతున్నారు. సేద్యం పంట దశలో వున్నప్పుడే ధ్వంసం చేస్తున్నాయని వారంటున్నారు. దాదాపు 13ఏనుగుల వరకు వున్నాయనీ, గ్రామాల్లోకి వచ్చేస్తాయేమో అన్న ఆందోళనలో ప్రజలున్నారు. ప్రభుత్వం స్పందించి గజరాజుల బెడద నుంచి రక్షించాలని వారు కోరుతున్నారు.



గజరాజుల దాడి దృశ్యాలు



#### ఆదుకొనేవారు లేరా...?

**వెంకట్రమణ చుక్కావారిపల్లి (కౌలు రైతు)**

ఏనుగుల బారినుంచి తమను ఆదుకొనే వారు లేరా...సంవత్సరం భూమిని లీజుకు తీసుకొని వరి, టమోటా సాగు చేస్తున్నాను, పంట చేతికందే సమయంలో ఏనుగలు ధ్వంసం చేస్తున్నాయి. అధికారులు,ప్రభుత్వం పట్టించుకొనిన్యాయం చేయండి.



#### నష్ట పోవాల్సిందేనా : కుమార్‌రాజు రైతు

మధురమలై అడవికి కొంత దూరంలో వున్న మామిడి, బీర, టమోటా పంటలను గజరాజులు తీవ్రంగా ధ్వంసం చేసాయి. వాటితోపాటు డ్రిఫ్ పైపులు, డ్రమ్ములు, ఆఖరికి పొలాలకుండే కంచె, కూసాలు వంటివి పెరికి పారేశాయి. ఇప్పటి వరకు 4సార్లు మాకు పంట నష్టం జరిగింది. ఎవరూ పట్టించుకోలేదు.



## పంటలపై ఏనుగుల స్వైర విహారం

రామకుప్పం, మే 29 ప్రభాతవార్త

మండలంలోని ఎస్. గొల్లపల్లి గ్రామ సమీప పంట పొలాలపై జంట ఏనుగులు స్వైర విహారం చేశాయి. బుధవారం రాత్రి నాగభూషణ్‌రెడ్డి, గంట్లప్పగౌడు, రామలక్ష్మి, విశ్వనాథ్, భక్తవత్సలం రెడ్డి అనే రైతులకు చెందిన మామిడి తోటల్లో చెట్ల కొమ్మలు విరిచి కాయలను నేలరాల్చాయి. మురుగేష్ గౌడు, జయరామప్పలకు చెందిన అరటితోటను నాశనం చేశాయి. అలాగే వ్యవసాయ పరికరాలను ధ్వంసం చేశాయి. ఉన్నతాధికారులు స్పందించి కుంకీ ఏనుగుల ద్వారా జంట ఏనుగులను దారి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున పంట నష్టపరిహారం అందించాలని కోరారు.

## అనుమానంతో భార్యపై కత్తితో దాడి...

### పరిస్థితి విషమం...

రేణిగుంట మే 29 ప్రభాతవార్త



అనుమానం పెనుభూతంగా మారి విచక్షణను పూర్తిగా కోల్పోయి తిరుపతి జిల్లా రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లి కేశం గ్రామ నివాసి గడ్డం మల్లికార్జున (66), గురువారం భార్య మునిలక్ష్మి(61) పై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా మారింది. వివరాలు ఇలా అల్లి కేశం గ్రామానికి చెందిన మల్లికార్జున, మునిలక్ష్మి భార్యాభర్తల అయినప్పటికీ గత కొంతకాలంగా విడివిడిగా జీవిస్తున్నారు. నెలరోజుల క్రితం పుట్టింటి వద్ద ఉన్న భార్యను కాపురానికి పిలిపించుకున్నాడు. అతనికి భార్యపైన అనుమానం. ఈ అనుమానం పెనుభూతంగా మారింది. ఈ నేపథ్యంలో భార్యను ఇంట్లో నుండి కొద్దిదూరం జుట్టు పట్టుకొని లాక్కొచ్చి మానవత్వాన్ని పూర్తిగా మర్చిపోయి నడిరోడ్డుపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో అతని భార్య తీవ్రంగా గాయపడింది. ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో అతని కూడా అక్కడక్కడ గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి హుటాహుటిన తమ సిబ్బందితో సంఘటన స్థలం చేరుకున్నారు. గాయపడిన మునిలక్ష్మిని తక్షణం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. భర్త మల్లికార్జునను అదుపులోకి తీసుకొని కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు..

### కొనసాగుతున్న రద్దీతో

## వెంకన్న దర్శనానికి 18గంటలు

తిరుమల,మే 29 ప్రభాతవార్తప్రతినిధి:



వేసవిసెలవులు ముగింపుకు చేరుకుంటున్న సమయంలో తిరుమల భక్తుల రద్దీ కొనసాగుతోంది గురువారం ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్ లలోని కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయి భక్తులు వెలుపల రెండు కిలోమీటర్లు క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 18గంటలు సమయం నిరీక్షణ తప్పడంలేదు. బుధవారంరాత్రి వరకు 83,621మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా కానుకల హుండీ ఆదాయం 3.93కోట్ల రూపాయలు చేకూరింది.

## 'మాస్క్' వేయాల్సిందే!

### ముందు జాగ్రత్తలు తప్పదంటున్న వైద్యవర్గాలు



ప్రభాతవార్త-తిరుపతి:

ఇప్పటికే ఉమ్మడిచిత్తూరుజిల్లాలో జలుబు, దగ్గు, జ్వరంతో పలువురు ఇబ్బందిపడుతున్నారు. కురిసిన వర్షాలకు సీజన్‌లో మార్పులతో ఇవీ మామూలేనని వైద్యులు చెబుతున్నా కొన్ని జాగ్రత్త చిట్కాలు పాటించాలని సూచిస్తున్నారు. మళ్ళీ కరోనా వైరస్ భయం ఎలా ఉన్నా ప్రసిద్ద యాత్రాస్థలాలు, పుణ్యక్షేత్రం తిరుపతి,తిరుమలలో వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తం కానుంది. వాతావరణంలో మార్పులు రావడంతో ఈ కేసులు నమోదవుతున్న సమయంలో సీజనల్ వ్యాధులు తరచుగా చిన్నపిల్లలు,యువకులు,అనారోగ్యంతో ఉన్న వాళ్ళు, వృద్ధుల్లో అధికంగా వచ్చే అవకాశం ఉందని ఐఎంఎ వైద్యులు చెబుతూన్నారు. ఇప్పుడు ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని అంటున్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఇప్పటి నుండే మాస్క్ ధరించాల్సిందేనని, భౌతికదూరం పాటించాలని, తరచుగా సబ్బు, శానిటైజర్‌తో చేతులు కడుక్కోవాలని సూచిస్తున్నారు. జలుబు,దగ్గు విపరీతంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యవర్గాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే ఈ వైరస్ విశాఖపట్నం, కడపలో వైరస్ పాటిజివ్ కేసు నమోదు కావడంతో వైద్యవర్గాలు ప్రజలను ముందస్తు అప్రమత్తం చేస్తున్నారు.ఇదే విషయంగా ప్రభుత్వ వైద్యవర్గాలు కూడా రాష్ట్రంలో వైద్యులుఅప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వం అప్రమత్తమైందని వెల్లడించారు. అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడంతో వైద్యవర్గాలు అప్రమత్తమవుతున్నాయి. రాష్ట్రంలోకి కొత్తగా వచ్చే విదేశీయులపై,బయటి నుండి వస్తున్న వారిపై దృష్టి పెట్టాలని, ఎక్కడ అనుమానం ఉన్నా పూర్తిస్థాయి పరీక్షలు జరపాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తిరుపతి,తిరుమలకు ప్రతిరోజూ 60వేలమంది యాత్రికులు దేశం నలుమూలల రాష్ట్రాల నుండి, విదేశాల నుండి వస్తున్నారు. ఇప్పుడు ప్రజలు ఎవరికివారే జాగ్రత్తలు తీసుకోవాలని, మాస్కు ధరించడం తప్పనిసరి అని వైద్యులు ప్రధానంగా సూచిస్తున్నారు.

# మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రణాళికలు సిద్ధం

### కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



చిత్తూరు, మే 29 ప్రభాతవార్త:

జిల్లాలో జూన్ నెలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి అటవీ, డ్వామా, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ డిఎఫ్ఓ భరణి, సామాజిక అటవీశాఖ అదికారి జ్ఞానప్రకాష్, డ్వామా పిడి రవికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణలతో కలిసి 2025 జూన్, జులై నెలల్లో జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున పచ్చదనం పెంపొందించడానికి జూన్, జులై నెలల్లో ప్రభుత్వ భూములు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడానికి అటవీ, డ్వామా, వ్యవసాయ శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో వున్న నర్సరీ కేంద్రాలను డిఎఫ్ఓ, డ్వామా పిడి, ఎపిడిలు, జిల్లా వ్యవసాయ అధికారి, ఎడిలు ముందుగా వెళ్ళి పరిశీలించాలన్నారు. డ్వామా ద్వారా ఎపిడిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, వ్యవసాయ శాఖ ద్వారా ఎడిలు, ఎఓలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకుని వారి పరిధిలో వున్న మండల, గ్రామ స్థాయిలో రైతులతో మాట్లాడి వారికి అవసరమైన వివిధ రకాల మొక్కలు పంపిణీకి సంబంధించి వివరాలను సిద్ధం చేయాలన్నారు. ఒక మండల పరిధిలో రెండు, మూడు చోట్ల మొక్కల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో వున్న మొక్కల పంపిణీ కేంద్రాల వివరాలను రైతులకు ముందుగానే తెలియజేయాలన్నారు. జిల్లా అటవీశాఖ ద్వారా నిర్వహిస్తున్న నర్సరీ కేంద్రాలు వున్న ప్రాంతాల వివరాలను డ్వామా, వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా ఎపిడిలు, వ్యవసాయ శాఖ ఎడిలు పాల్గొన్నారు.

# యోగా దైనందిన జీవితంలో ఒక భాగం కావాలి...: ఎమ్మెల్యే

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం - జిల్లా కలెక్టర్

తిరుపతి క్రీడ, మే 29, ప్రభాతవార్త:

యోగా మన దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎంఎల్ఏ ఆరని శ్రీనివాసులు సంయుక్తంగా పేర్కొన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతి శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్కు నందు యోగ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించిన యోగాంధ్ర 2025 శిక్షణా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జూ క్యూరేటర్ సెల్వం, డి ఎఫ్ ఓ వివేక్, యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ నెల 21 న మహిళా వర్సిటీలో యోగా దినోత్సవాన్ని ప్రారంభించామని, అప్పటి నుండి ప్రతి రోజు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి మండలానికి నలుగురు మాస్టర్ ట్రైనర్‌లను ఏర్పాటు చేశామని వారు ఒక్కొక్కరు 200 మందికి ట్రైనింగ్ ఇచ్చి ప్రతి మండలంలో, గ్రామంలోని ప్రతి పౌరుడికి యోగా పై అవగాహన కలిగేలా చూస్తున్నామని. తీసుకుంటున్నామని అన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్రను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి రామ్మోహన్, సాంఘిక సంక్షేమ



సాధికారతాధికారి మరియు నోడల్ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, డిఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, టూరిజం శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, అటవీశాఖ అధికారులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ. ఇంచార్జ్ . శశి. హాకీ కోచ్. శ్రీలక్ష్మి కరుణ, స్కేటింగ్ కోచ్. ప్రేమ్ నాథ్. జూడో కోచ్. గోపి. ఫుట్బాల్ కోచ్ వినోద్, వాలీబాల్ కోచ్ యహజాజ్, రగిలిన్ కోచ్ సాయి సుమతి, క్రీడాకారుడు, సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆయుష్ సిబ్బంది, స్థానిక ప్రజలు, యువత విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సంఘ సభ్యులకు చేరువగా పథకాలు

**- డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి**

**చిత్తూరు, మే 29 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే అన్ని పథకాలు స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు చేరువ కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి పిలుపునిచ్చారు. జిల్లా సమాఖ్య భవనంలో గురువారం జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీళ అధ్యక్షతన జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన కోసం అనేక పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయని, వీటిని సంఘ సభ్యులు క్షేత్ర స్థాయిలో సద్వినియోగం చేసుకునే విధంగా జిల్లా సమాఖ్య ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. జిల్లాలో లక్ష మంది సంఘ సభ్యులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని, ఈ లక్ష్యంను అధికమించాలంటే సంఘాల్లో పారిశ్రామికవేత్తలుగా ఎదిగే



అర్హత వున్న సంఘ సభ్యులను ముందుగా గుర్తించాల్సిన అవసరం వుందన్నారు. ప్రతి నెల 30 వేల మంది మహిళలను గుర్తిస్తే లక్ష్యాలను అధికమించే అవకాశం వుందన్నారు. ఇందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో వెదురు, మునగ పంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం వుందన్నారు. ఇందుకోసం ఏడు మండలాలను గుర్తించడం జరిగిందని, ఈ మండలాల్లో వెదురు, మునగ వల్ల కలిగే ప్రయోజనాలు, ఆర్థిక లాభాలపై సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మొబైల్ వ్యాన్ ద్వారా రైతులు పండించిన తాజా కూరగాయలు, సంఘ సభ్యులు చిరుధాన్యాలతో తయారు చేసిన తినుబండరాలు, చిరుధాన్యాలను ప్రజల వద్దకే తీసుకెళ్ళి విక్రయించే కార్యక్రమంను తవణంపల్లి మండలంలో చేపట్టడం జరిగిందని, ఈ మొబైల్ వ్యాన్ ద్వారా విక్రయాలు పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. అలాగే సంఘాలు ఆర్థిక లావాదేవిలపై ఎక్కడా అక్రమాలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. సంఘాల ఆర్థిక వ్యవహారాలను సంబంధించి సాంకేతిక పరిజ్ఞానంను అందిపుచ్చుకోవాలన్నారు. జులై నెలలో జరిగే జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయడానికి సంఘ సభ్యులుకృషిచేయాలన్నారు. ఈసమావేశంలోడిపిఎం రవి, ఎపిఎంలు హేమ, సుబ్బారెడ్డి, మధు, జిల్లాసమాఖ్యప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పాత తారుతో సరిపెట్టేసారు

పాకాల, మే 29, ప్రభాతవార్త



పాకాల మండలం దామల చెరువు దగ్గర గోతులపడ్డ రైల్వే లెవెల్ క్రాసింగు ఇరు వైపులా రోడ్డు. ఇటు వైపు వెళ్లే వాహన దారులకు తప్పవు పాట్లు అన్న చందంగా మారింది ఇక్కడి పరిస్థితి. పాకాల నుంచి ధర్మవరం వెళ్ళే మార్గంలో దామల చెరువు రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు వద్ద ట్రాక్ రెండు వైపులా దాదాపు 20 మీటర్ల దూరం రోడ్డుపై భారీ గోతులు ఏర్పడడంతో అధికారులు ఇటీవల వేరొకచోట తొలగించిన తారు రోడ్డు అవశేషాలతో కొద్దిపాటి మరమ్మతులు చేసి నిర్లక్ష్యంగా ఆలా వదిలేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దామలచెరువు పాకాల మధ్యలో సంవత్సరం క్రితం నూతన తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి నప్పటికి రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు వద్ద మాత్రం రెండు వైపులా దాదాపు ఇరవై మీటర్ల దూరం రోడ్డు గుంతల మయంగా ఉండి వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున రైల్వేశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద త్వరిత గతిన గోతుల పై నూతన తారు రోడ్డు నిర్మాణం చేయవలసినదిగా ఇటుగా ప్రయాణించు ప్రజలు వాహనదారులు రైల్వే ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మూడు నెలలు పొడిగింపు

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

**చిత్తూరు, మే 29 ప్రభాతవార్త:** జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలల పాటు పొడిగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షుశుక్లా ఉత్తర్వులు జారీ చేశారని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని 1 జూన్ 2025 నుండి 31 ఆగస్టు 31 వరకు లేదా కొత్త కార్డుల జారీ ప్రక్రియ చేయడం గాని ఏది ముందు జరిగితే అప్పటి వరకు ఈ పొడిగింపు ఉత్తర్వులు అమలులో వుంటాయని తెలిపారు. ప్రస్తుతం 31 మే 2025 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పని చేస్తున్న పాత్రికేయులకు మాత్రమే 1 జూన్ 2025 నుండి 31 ఆగస్టు 2025 వరకు అక్రిడేషన్ పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు.

## 31న పౌర హక్కులదినోత్సవం

సదుం, మే 29, ప్రభాతవార్త

ఈనెల 31న మండల తాసిల్దార్ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ జయప్రకాష్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతినెల చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. శనివారం సాయంత్రం మూడు గంటలకు జరిగే సమావేశానికి ప్రజలు సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

## నేడు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో మెగా యోగా కాంపెయిన్

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

**చిత్తూరు, మే 29 ప్రభాతవార్త:**

యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిత్తూరు ప్రశాంత్‌నగర్‌లోని జిల్లా పోలీసు మైదానంలో మెగా యోగా కాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మెగా కాంపెయిన్ ఉదయం 6.30 గంటల నుండి ఉదయం 8 గంటల వరకు వుంటుం దని ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, వారి సిబ్బంది పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు.

## తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

.తొట్టంబేడు, మే 29 ప్రభాతవార్త



తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు గురువారం చే పట్టారు. పలుమార్లు ఇక్కడి తహశీల్దార్ కార్యాలయంలో గతంలో ఇక్కడ తహ శీల్దార్‌గా పనిచేసిన వీరా స్వామి, విఆర్‌ఓ శివలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే. తర్వాత ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన పరమేశ్వరస్వామి కూడా ఎసిబి అధికారులకు దొరికిపోయి సస్పెండ్ అయిన విషయం విదితమే. అప్పట్లో వచ్చిన ఎసిబి అధికారులు ఇక్కడి కార్యాలయంలో పూర్తిస్థాయిలో రికార్డులు స్వాధీనం చేసుకుని ఇప్పటి వరకు అప్పగించలేదు. అనంతరం కొద్దిరోజుల తర్వాత ఆయన తిరుపతి కలెక్టరేట్‌లో పనిచేశారు. అనంతరం మరో మండలానికి బదిలీ అయ్యారు. ఇక్కడ కూడా ఓ పెట్రోలు బంకు అనుమతికోసం నగదు తీసుకున్నారన్న ఆరోపణలతో సస్పెండ్ అయిన విషయం విదితమే. గురువారం కార్యాలయానికి చేరుకున్న విజిలెన్స్ డిఎస్పీ మల్లికార్జున, ఎస్ఐ వెంకటేశ్వర్లు హఠాత్తుగా కార్యాలయానికి చేరుకుని గతంలో పరమేశ్వరస్వామి ఇక్కడి కార్యాలయంలో ఏఏ పనులు చేశారో సమగ్రంగా విచారించారు. ముఖ్యంగా ఈదులగుంట సర్వే నంబర్ 42లో ఉన్న సుమారు 20 ఎకరాల భూమి గతంలో మరో పేరుపై మార్చివేసి దాన్ని తొలగించిన విషయం విదితమే. అయితే మరో కొద్దిరోజుల్లో ఆయన రిటైర్డ్ కానుండడంతో విజిలెన్స్ అధికారులు ఆయనపై మరోసారి ఇక్కడి కార్యాలయంలో ఏఏ అవినీతి పనులు చేశారో విజిలెన్స్ డిఎస్పీ, ఎస్ఐలు డిప్యూటీ తహశీల్దార్ జగన్‌మోహన్, విఆర్‌ఓ మునికుమారిలను విచారించి వారి నుంచి స్టేట్‌మెంట్ నమోదుచేసుకున్నారు. గత శనివారం కూడా శ్రీకాళహస్తి, తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయాలకు ఏసిబి అధికారులు వచ్చి రహస్య విచారణ చేసినట్లు తెలిసింది. అయితే అవినీతి, అక్రమాలు ఎక్కువవడంతోనే శ్రీకాళహస్తి, తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయాలపై ఎసిబి అధికారులు దృష్టిసారించినట్లు తెలిసింది.

## వైస్ ఎంపిపి బాలాజీకి మాతృవియోగం

విజయపురం, మే 29 ప్రభాతవార్త: విజయపురం మండల పరిషత్ వైస్ ఎంపీపీ కేవీ పురంగ్రామానికి చెందిన మంజు బాలాజీ తల్లివనమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ మంత్రి రోజా వెళ్లి వనమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వైస్ ఎంపీపీ బాలాజీని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు. వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి గోవర్ధన్‌నాయుడు, స్థానిక నాయకులు రామకృష్ణంరాజు, ప్రతాప్‌రాజు, హరిబాబు, ప్రసన్న, జబమేరి, సుధాకర్, అరుణాకచలం, ఏళుమలైరెడ్డి, కన్నన్, నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

## పట్టణాభివృద్ధికి సమిష్టి కృషి చేద్దాం



**– చైర్మన్ అలీమ్ భాష**

పుంగనూరు, మే 29 ప్రభాతవార్త

పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడంలో అందరూ కలిసికట్టుగా పని చేద్దామని మున్సిపల్ చైర్మన్. గురువారం ఉదయం ఆయన అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు తమ వార్డులలో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. గృహ నిర్మాణ అనుమతి జాప్యాలను, అక్రమ నీటి వినియోగం పై దృష్టి, విస్తరించబడుతున్న శివారు ప్రాంతాలలో సదుపాయాలు కల్పన, మజీలీటి కుళాయిల ఏర్పాటు వీధి దీపాల ఏర్పాటు పై పలువురు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలను ఏకగ్రీవం ఆమోదించిన మున్సిపల్ కౌన్సిల్. పుంగనూరు పట్టణంలో మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాషా, అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించారు. పట్టణంలో అభివృద్ధి పనుల కోసం అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బందికి యోగాంధ్ర శిక్షణా కార్యక్రమం

సదుం, మే 29, ప్రభాతవార్త



మండలంలోని వెలుగు మహిళలకు పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వ ఉద్యోగులకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హరిబాబు మాట్లాడుతూ యోగా అనేది మన భారతదేశానికి అతి పురాతన సంపద. ఇది కేవలం వ్యాయామం మాత్రమే కాదు – ఇది ఒక జీవన శైలి. యోగా ద్వారా మనం శారీరక, మానసిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక స్థాయిలో అభివృద్ధి చెందుతాం. యోగా ద్వారా మన శరీరంలోని ప్రతి అవయవం శక్తివంతంగా మారుతుంది. ఇది మానవ శరీరాన్ని స్థిరంగా, శక్తివంతంగా ఉంచుతుంది. ఈ రోజుల్లో అందరూ ఒత్తిడికి లోనవుతున్నారు. రోజూ కొన్ని నిమిషాల యోగా సాధన మన మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. యోగా సాధన ద్వారా మనలో ఆత్మవిశ్వాసం, ధైర్యం మరియు సహనశక్తి పెరుగుతుంది. ధ్యానం శ్వాసాపక వ్యాయామాలు మన ఒత్తిడిని తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. జీవితంలో ఆరోగ్యం అంటే కేవలం రోగాలు లేకపోవడమే కాదు, శరీరం, మనస్సు, ఆత్మ అన్ని కలిసిన సమతుల్యత. యోగా ఈ సమతుల్యతను తెస్తుంది. అందుకే యోగాను మన రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దామోదర, యోగా టీచర్లు, కిషోర్ కుమార్, రెడ్డి ప్రవీణ, సుధారాణి, మండల పరిషత్తు సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహానాడుకు తరలిన పోటుకనుమ టిడిపి కార్యకర్తల బృందం

పూతలపట్టు, మే 29, ప్రభాతవార్త



పూతలపట్టు మండలానికి చెందిన పోటుకనుమ గ్రామంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మూడవ రోజు జరుగుతున్న మహా నాడు కార్యక్రమానికి పాల్గొనడానికి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్బరాజుల ఆధ్వర్యం లో రెండు వాహనాలలో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ సీనియర్ నాయకులు నాగరాజుల నాయుడు, పార్టీ జెండా ఊపుతూ ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీకి చెందిన ప్రముఖ దళిత నాయకులు పెద్దపాళ్యం నాగేంద్రబాబు, చెంగల రాయులు, పి. అంజి, వెంకట కృష్ణయ్య, పి. శరత్ బాబు, ధనంజయ్, భాస్కర్, చందు తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

## కడప దారి పట్టిన తెలుగు తమ్ముళ్ళు

చౌడేపల్లి, మే 29 ప్రభాతవార్త



కడపలో తేదేపా తలపెట్టిన మహానాడుకు మండలం నుంచి తెలుగు తమ్ముళ్ళు తరలి వెళ్లారు. ఆపార్టీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని 19పంచా యతీల నుంచి వందలాదిగా తరలి వెళ్ళేలా చర్యలు తీసుకొన్నారు. గురువారం ఉదయాన్నే స్థానిక బస్టాండులో వాహనాలకు తేదేపా జెండాను ఊపి ప్రారంభించారు. మండలంలోని తేదేపా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కడప మహానాడుకు తరలి వెళ్ళారు.

## గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్ర

విజయపురం, మే 29 ప్రభాతవార్త: రాస్ కేవీకే ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐకేర్), న్యూ ఢిల్లీ వారి ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా విజయపురం మండలంలోని కలియంబాకం, సామిరెడ్డి కండ్రిగ, ఆలపాకంగ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం పశు వైద్య శాస్త్రవేత్త అనూష మాట్లాడుతూ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. భూసాన నమూనా సేకరణ పద్ధతులు, పచ్చి రొట్టె, ఎరువుల విత్తనాల వాడకం, ప్రీ ఖరీఫ్ జాగ్రత్తల గురించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పశు వైద్య శాస్త్రవేత్త అనూష, ఏడీఏ నగపద్మిని, మండల ఏవో రజనికుమారి, హార్టికల్చర్ ఆఫీసర్ లోకేష్, ఏపీఎంఐపీ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోండి

చిత్తూరురూరల్, మే 29 ప్రభాతవార్త:



మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ జిల్లాలో మామిడి రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ జిల్లా అధికారులు ఫ్యాక్టరీ యజమానులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి 10 రోజులు గడుస్తున్నా ఇంతవరకు గిట్టుబాటు ధర నిర్ణయించే విషయంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వం గిట్టు బాటు ధర నిర్ణయించకపోతే జూన్ 2న జిల్లా సచివాలయం ఎదుట రైతులతో భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి రైతు సోదరులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు హరిబాబు చౌదరి, రాసనపల్లి ప్రకాష్, చీలాపల్లి హరిబాబు, రఘునాధనాయుడు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రద్దు

చిత్తూరురూరల్, మే 29 ప్రభాతవార్త:

ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే వారం యధావిధిగా కొనసాగుతుందనీ, ఈ విషయాన్ని చిత్తూరు నియోజకవర్గ ప్రజలు గమనించాలని కోరారు.

## మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు

చిత్తూరురూరల్, మే 29 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ కడప గడపలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు చిత్తూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. పివికెయన్ కళాశాల మైదానం నుంచి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆధ్వర్యంలో చిత్తూరు అర్బన్ నుంచి 60 బస్సులు, 110 కార్లు, చిత్తూరు రూరల్ మండలం నుంచి 7 బస్సులు, 15 కార్లు గుడిపాల మండలం నుంచి11 బస్సులు, 35 కార్లలో నాయకులు, కార్యకర్తలు బయలు దేరారు. ఎమ్మెల్యే తండ్రి, జిజెఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవులు, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, గుడిపాల మండల తెదేపా అధ్యక్షుడు సుబ్బానాయుడులు వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నాయుడు, హేమాద్రినాయుడు, మధునాయుడు, అనిల్, మోహన్‌రాజ్, శశికర్‌బాబు, జగదీశ్వం నాయుడు, మేషక్ శ్యామ్, రఘు, మండల క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జీలు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుప్పం నుంచి మహానాడుకు భారీగా కార్యకర్తలు

కుప్పం, మే 29 ప్రభాతవార్త



కడప జిల్లాలో గురువారం జరిగిన మహానాడు ముగింపు కార్యక్రమానికి కుప్పం నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. చివరి రోజు మహానాడు కార్యక్రమంలో బహిరంగసభలో పాల్గొనేందుకు వీరు పయనమ య్యారు. ఉదయం నుంచేగ్రామాలకు చేరుకున్న ప్రత్యేక ప్రైవేట్ బస్సుల ద్వారా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు కడపకు బయలుదేరారు. కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె మండలాల నుంచి పార్టీకి చెందిన వివిధ కేడర్ నాయకులు, అనుబంధ విభాగాలు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున మహానాడు బహిరంగసభకు హాజరయ్యారు.

**రామకుప్పం :** రామకుప్పం మండలం నుంచి తెదేపా నేతలు, కార్యకర్తలు మహానాడు బహిరంగసభకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఉదయమే వివిధ వాహనాల్లో కడపకు బయలుదేరారు. అక్కడ జరిగిన మహానాడు బహిరంగసభకు హాజరయ్యారు.

## ఎన్ఎంయు నుంచి ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరికలు

కుప్పం, మే 29 ప్రభాతవార్త కుప్పం ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయు సంఘం నుంచి ఎంప్లాయిస్



యూనియన్ సంఘంలోకి సుమారు 54మంది చేరారు. ఎన్ఎంయు రీజనల్ అధ్యక్షుడు వేలు, బొట్టుమణి, నారాయణ, భాస్కర్, హరిబా బు తో పాటు పలువురు డిపో ఎంప్లాయిస్ యూని యన్ కార్యదర్శి మరియు రీజనల్ కార్యదర్శి సమక్షంలో చేరినట్లు సంఘం నేత బలరాంమూర్తి తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ విధి విధానాలు నచ్చి వారు చేరారని తెలిపారు.

## మహానాడుకు తరలి వెళ్ళిన దేశం నాయకులు

సోమల, మే 29, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి మండలం నుంచి అత్యధిక సంఖ్యలో నాయకులు కార్య కర్తలు తరలి వెళ్లారు. మూడ వరోజు బహిరంగ సభకు హాజరయ్యేందుకు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. సాంబయ్య ఆధ్వర్యంలో పలునాయకులు తరలి వెళ్లారు. రాష్ట్ర రైతు సంఘ అధికార ప్రతినిధి సోమల సురేష్, సోమల సద్దాం, కొల్లా లోకేష్ నాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పత్రి లక్ష్మయ్య, ముత్యాల నాయుడు, మైనార్టీ నాయకుడు రషీద్ తదితరులు తరలి వెళ్లారు. అలాగే మండలం నుంచి వివిధ వాహనాల్లో భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్ల కడపకు తరలివెళ్లారు.

## శ్రీ దక్షిణామూర్తికి ఘనంగా పూజలు

పుంగనూరు, మే 29, ప్రభాతవార్త



పట్టణంలోని కోనేటి వద్ద వెలిసిన శ్రీ కాశీ విశేశ్వర స్వామి ఆలయంలో దక్షిణ మూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సుబ్బయ్య దీక్షతులు స్వామి వారి శిలా విగ్రహాన్ని పంచామృతాలతో పాటు సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. తర్వాత ప్రత్యేకంగా వివిధ పుష్పలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

## 31న బ్రాహ్మణ సంఘం సేవాసమితి మహోత్సవం

శ్రీకాళహస్తి, మే 29 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్రంలోని అన్ని జిల్లాలో నియోజకవర్గాలలో పర్యటించి జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి తద్వారా రాష్ట్ర కమిటీని బలోపేతం చేయనున్న తరుణంలో తిరుపతి జిల్లాలో ఉన్న బ్రాహ్మణ సంఘాలను అన్నింటిని కలుపుతూ తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సంయుక్త కార్యదర్శి చింతలపల్లి సురేష్‌కుమార్, రాష్ట్ర యువజన సంక్షేమ అధ్యక్షుడు వేదం హరిప్రసాద్‌లు సంయుక్తంగా తెలిపారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో ఉన్న బ్రాహ్మణ సంఘాలను అన్నింటినీ కలుపుతూ జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమితి ఏర్పాటు చేసి బ్రాహ్మణుల్లో ఐకమత్యంగా మెలిగే విధంగా కృషి చేసినట్లుగా తెలిపాఉ. తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాలు అన్నింటినీ కలపాలన్న లక్ష్యంతో గత ఫిబ్రవరి నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తులసిరామ్‌వర్మ, దర్భాకుమార్, తంగిరాల సుబ్బమణ్యంశర్మ, కిషోర్‌శర్మలు పర్యటించినట్లు తెలిపారు.

సుమారు ఎన్ని సంఘాల ఉన్నా బ్రాహ్మణులు అందరు ఒకటేనని చెబుతూ ఈనెల 31వ తేదీన శ్రీకాళహస్తిలో బ్రాహ్మణ సమ్మేళనం నిర్వహించి అందులో జిల్లాలోని వివిధ బ్రాహ్మణ సంఘాల అధ్యక్షులను మరియు కార్యవర్గాన్ని పరిచయం చేయనున్నామన్నారు. బ్రాహ్మణ సంక్షేమమే లక్ష్యంగా తిరుపతి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి అనే పేరుతో శ్రీకాళహస్తిలో బ్రాహ్మణ భవనం నందు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని ఆరోజే ప్రమాణ స్వీకారం చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు రామరాజు, రాష్ట్ర కార్యదర్శి వాసుదేవరావు, జిల్లాలోని అన్ని బ్రాహ్మణ సంఘాలను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు.

## మహానాడుకు అధికసంఖ్యలో తెలుగుతమ్ముళ్ళు

తొట్టంబేడు, మే 29 ప్రభాతవార్త



మహానాడుకు అధిక సంఖ్యలో తెలుగు తమ్ముళ్ళు బయలుదేరి వెళ్ళినట్లు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజ నాయుడు తెలిపారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డు నుంచి తొట్టంబేడు మండల నాయకులు, మహిళలు అధికసంఖ్యలో హాజరై ప్రత్యేక బస్సులో బయలుదేరారు. మండల పార్టీ అధ్యక్షుడు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. మహానాడుకు తరలివెళ్ళిన వారిలో యువనాయకుడు కన్నలిప్రతాప్‌రెడ్డి, పూడి మాజీ సర్పంచ్ మునిరత్నం, చిట్టత్తూరుకు చెందిన బాలాజీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వాడపల్లిజయచంద్రనాయుడు చింతారాజేంద్ర, నాయకులు దొరైరాజ్, మాజీ జడ్పీటిసి వెంకటాచలం, లెక్కలమురళీనాయుడు, మహిళా నాయకురాలు రమాదేవి ఆధ్వర్యంలోపలువురు మహిళలు అధిక సంఖ్యలో హాజరై జై తెలుగుదేశం..జైజై చంద్రబాబు..యువగళం నాయకుడు జై లోకేషన్న అంటూ నినాదాలు చేస్తూ తరలివెళ్ళారు.

## జిల్లా కాంగ్రెస్‌పార్టీ సమావేశంలో శ్రీకాళహస్తి నేతలు

శ్రీకాళహస్తి, మే 29 ప్రభాతవార్త



జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశానికి శ్రీకాళహస్తి నుంచి తలపాదామోదరంరెడ్డి, తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబుల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలసి తలపా దామోదరంరెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలపడడానికి అనుసరించాల్సిన కార్యాచరణ మరియు ప్రణాళికలను రూపొందించడంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గం మరియు నియోజకవర్గ సమన్వయకర్తలు మండల అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులకు సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేలా పనిచేస్తామని అనుబంధ కమిటీలను పూర్తిచేస్తామని దామోదరం తెలిపారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జననీ మిత్ర యాప్ గర్భిణీ స్త్రీలకు వరం......

డెమో కిరణ్ కుమార్..



రేణిగుంట మే 29 ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జననీ మిత్ర యాప్ గర్భిణీ స్త్రీలకు గొప్ప వరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డెమో కిరణ్ కుమార్య్ అన్నారు. తిరుపతి జిల్లా ప్రాథమిక వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ నాయక్ ఆదేశాలతో రేణిగుంట మండల వైద్యాధికారి డాక్టర్ ఛత్ర ప్రకాష్ సూచనల మేరకు రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గురువారం జనని మిత్ర యాప్ పై అవగాహన కల్పించారు. డెమో కిరణ్ కుమార్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తమ పేర్లను ఈ యాప్ నందు నమోదు చేసుకుంటే వారికి ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారాలు లభిస్తాయన్నారు. ఆరోగ్య సమస్యల నుండి మందులు, పోషకాహార విధానాలు, అవసరమైన వైద్య పరీక్షలు చేసే అవకాశం ఉంటుందన్నారు. వైద్యపరమైన సహాయం తక్షణం లభిస్తుందన్నారు. వెంటనే గర్భిణీ స్త్రీలు తమ ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ నందు యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ హైమావతి, హెల్త్ సూపర్వైజర్లు నాగరాజు, కామరాజు, అనురాధ, ఆశా కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

## బోరు పక్కన పాడుబడ్డ ఇల్లు: పాములకు ఆవాసం

శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిమున్సిపల్ పరిధిలోని 17వ ప్రజలు ఓ పాడుబడ్డ ఇంటిలో పాములు నివాసముండటంతో భయబ్రాంతులౌతున్నారని మున్సిపల్ కమిషనర్కు ఫిర్యాదు చేసారు. గురువారం వార్డుకు చెందిన న్యాయవాది రాజేశ్వరరావు ఈ సంఘటనకు సంబంధించి ఫిర్యాదు చేసారు.వార్డులోని ఒకటవ నెంబర్ బోరు సమీపంలో ఓ ఇల్లు పాడుబడిందని అక్కడ చెత్తా చెదారాలనువేయటంతో అక్కడ పాములతో పాటు విషపురుగులు చేరినట్లు వివరించారు.ఇక్కడ బోరు ఉండటంతో ప్రజలు నీటి కోసం వెళుతుంటారని అలాగే వార్డు మధ్యలో ఉండటంతో పసిపిల్లలు ఆడుకుంటూ అక్కడకు వెళుతుంటారని పేర్కొన్నారు. ఇంటి యజమానికి ఎన్నో సార్లు ఇరుగుపొరుగు ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వివరించారు.ఈ భవనాన్ని కూలదోయాలని కోరుతున్నట్లు వివరించారు.వచ్చేది వర్షాకాలం కాబట్టి అధికారులు అయినా స్పందించాలని కోరుతున్నారు.

## శివయ్య సేవలో చిలకలూరి పేట ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుని సేవలో గురువారం చిలకలూరి పేట శాసనసభ్యుడు పత్తిపాటి పుల్లారావు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. వారికి తెలుగుదేశం యువ నాయకుడు లక్కమనేని మధు ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. పుల్లారావు కుటుంబసభ్యులతో రాగా దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్మేరకు ఆలయ ఎఇఓ సతీష్మాలిక్, పిఆర్ఓ రవిలు వేదపండితులతోస్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు.అలాగే స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు,చిత్రపటాలను సతీష్మాలిక్ అందించారు. పుల్లారావుతో పాటు ఆ నియోజకవర్గ నాయకులు కూడా ఉన్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త



యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా గురువారం మూడవ రోజు శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది,అధికారులు యోగా సాధన చేసారు. మున్సిపల్ కమిషనర్ బి.యస్గిరి కుమార్ సారథ్యంలో మున్సిపాలిటికి చెందిన సుమారు 75 ఉద్యోగులు యోగసాధనలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. యోగాతో అధికారులు, ఉద్యోగులు ఎంతో మానసిక వత్తిడికి గురౌతుంటారని అలాంటి సమయంలో మానసిక ప్రశాంతత కొరకు యోగ సాధన ఎంతో ఉపయోగపడుతుందని తన సిబ్బందికి వివరించారు. అంతేకాక ఉదయాన్నే యోగా సాధనతో రోజంతా యాక్టివ్గా పని చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యరీత్యా ఇది ఎంతో ప్రయోజనకరం అన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి పేదలకు అండగా ఉండాలి!

రేఫర్స్ సంస్కృతికి స్వస్తి చెప్పండి బృందమ్మ

శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని గురువారం శ్రీకాళహస్తి శాసనసభ్యుడు సుధీర్రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ఆకస్మికంగా తనిఖీ చేసారు. నిరుపేదలకు సంబంధించిన ఆసుపత్రిలో వైద్యసేవలు ఎంత వరకు అందుతున్నాయి? ఇక్కడ పరిపాలన పరిస్థితి? సదుపాయాలకు సంబంధించి ఆమె వాకబు చేసారు. ప్రతి వార్డుకు వెళ్లి చికిత్స పొందుతున్న వారిని డాక్టర్లు,నర్సులు అందిస్తున్న సేవల గురించి వాకబు చేసారు.రోగులకు, అటెండర్లకు అందిస్తున్న భోజనం గురించి వాకబు చేసారు. బెడ్ బెడ్కు వెళ్లి రోగులను పలకరిస్తూ ఇక్కడ ప్రత్యేక్ష దైవాలుగా కనబడే డాక్టర్లు,నర్సులు అందిస్తున్న సేవలను విచారించారు. తరువాత నిరుపేదలకు సంబంధించి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రవేశ పెట్టిన ప్రత్యేక సదుపాయాల అమలు తీరును ఆమె డాక్టర్లతో చర్చించారు. దేశంలో మళ్ళీ కరోనా విజృంభిస్తున్న తరుణంలో ముందుజాగ్రత్త చర్యల గురించి డాక్టర్లతో సమీక్షించారు. నిరుపేదలను రెఫర్ చేసే సంప్రదాయానికి స్వస్తి చెప్పాలని సూచించారు.గత పాలనలో మంజూరు అయిన నిధులు నిర్మించిన భవనాల రికార్డులను ఆమె పరిశీలించారు. నిధులు భారీ ఎత్తున దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. ఇక నేడు మారుతున్న వాతావరణం దృష్ట్యా నియోజకవర్గంలో డెంగ్యూ,టైఫాయిడ్ జ్వరాలు రాజ్యమేలుతున్నాయి. ఇందుకు సంబంధించి వైద్యపరీక్షలు జరుపుకునేందుకు అవసరమైన సదుపాయాలపై బృందమ్మ డాక్టర్ల బృందంతో చర్చించారు. ఇక ఎక్స్రే,గుండెపోటు వస్తే కాపాడే ఇంజెక్షన్స్, ఇసిజి ప్లాంట్స్కు సంబంధించి వివరిస్తూ డాక్టర్లు విధి నిర్వహాణలో ఎలా పని చేస్తున్నారనే అంశాలను రికార్డులను పరిశీలించారు. ఆమె అ డిగిన ప్రశ్నలకు ఆసుపత్రికి చెందిన సూపరింటెండెంట్లు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ మణిదేవిలు సమాధానం చెప్పారు.

## గాందీవీధిలో వెలగని వీధి దీపాలు

శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిదిలో గత కొంత కాలంగా కొత్త విద్యుత్ దీపాలు కొనుగోలు చేయటం లేదు.దాంతో ఏళ్ళ నాటి ఎల్ఇడి దీపాలు వెలగటం లేదు. అయితే మున్సిపల్ విద్యుత్ శాఖ ఉద్యోగులు తూ తూ మంత్రంగా వారికి ఫిర్యాదు అందినప్పుడు మరమ్మత్తులు చేస్తున్నారు.కానీ పలు వీధుల్లో రాత్రి వేళ చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. పలు ప్రాంతాల్లో కాలనీలు విస్తరించాయి.కానీ అక్కడ విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు కావటం లేదు.నివాశస్తులు విద్యుత్ శాఖకు సొమ్ములు చెల్లించి విద్యుత్ లైన్లు పోల్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు.కానీ మున్సిపాలిటి వారు కొత్త విద్యుత్ లైట్లు పిక్స్ చేయాల్సి ఉంది.

## శ్రీకాళహస్తి మండలం నుంచి మహానాడుకు..

శ్రీకాళహస్తిరూరల్,మే 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం నుంచి కడపలో జరిగే మహానాడుకు పోలోమని కార్యకర్తలు బయలుదేరి వెళ్ళారు. గురువారం పొద్దు పొడవక ముందే మండలంలో తెలుగుదేశం సంబరాలు మొదలయ్యాయి. మండల నాయకులు రంగినేని చెంచయ్యానాయుడు చెలికం పాపిరెడ్డిల నేతృత్వంలో మహా నాడుకు ప్రత్యేక బస్సులు కార్లు ఏర్పాటు చేసారు. మండలంలోని నాయకులు జనాన్ని సమీకరించారు. మండలం నుంచి 29 బస్సులు,20కార్లు ఏర్పాటు చేసారు. మండలంలోని ప్రధాన రహదారి వాంపల్లి నుంచి బస్సులను వరుస క్రమంలో ఏర్పాటు చేసారు. వెళ్ళే వారికి భోజన వసతులు ఏర్పాటు చేసారు.మహానాడు వద్ద ప్రతి ఒక్కరు జవాబుదారి తనంతో సహాకరించాలని సూచించారు. నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. చెంచయ్యానాయుడు, పాపిరెడ్డి, రమేష్, రాజా, కృష్ణారెడ్డి తదితరులు సారధ్యంలో కార్యకర్తలు గ్రామ నాయకులు బయలు దేరారు.

## జనసేన సీఎస్ చక్రవర్తికి జనసేన నాయకులు ఘన సన్మానం

**సత్యవేడు, మే 29 ప్రభాతవార్త:** పవన్కళ్యాణ్ పర్సనల్ సెక్రటరీ చక్రవర్తికి సత్యవేడు నియోజకవర్గం జనసేన నాయకులు పలువురు ఘన స్వాగతం పలికారు. గురువారం నాగలాపురం మండలం సురుటు పల్లి శ్రీపల్లికొండేశ్వర స్వామి దర్శనార్థం నేపథ్యంలో నాయకులు చక్రవర్తిని కలిశారు. నియోజకవర్గం జనసేన నాయకుడు కానాల బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో పలువురు జనసేన సైనికులు సురుటుప ల్లిఆలయం వద్ద పవన్కళ్యాణ్ పర్సనల్ సెక్రటరీ చక్రవర్తిని కలిశారు. ఈ నేపథ్యంలో పీఎస్ చక్రవర్తితో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆలయ దర్శనం కల్పించడం జరిగింది. అనంతరం ఆలయ ఈవో లత సమక్షంలో చక్రవర్తి గజమాలతో సత్కరించారు. సత్యవేడు నియోజకవర్గ సమస్యలు, రాజకీయ పరిణా మాలను బాల మురళీకృష్ణ ఈ సందర్భంగా పవన్కళ్యాణ్ పీఎస్ చక్రవర్తికి వివరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రాం ఆర్గనైజ్ కమిటీ సభ్యులు కొండమురళి, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి తడ, శ్రీనివాసులు, జనసేన నాయకులు బాలమురళి, కృష్ణ, పసుపులేటి విజయకుమార్, ఠాగూర్, టీడీపీ నాయకుడు చికెన్చిన్న(పి.మురళి), లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మకు పులివర్తి సుధారెడ్డి సారె

రామచంద్రాపురం, మే 29 ప్రభాతవార్త:



నడవలూరులో జరిగిన నడివీధి గంగమ్మ జాతరను పురస్కరించుకుని గురువారం ఎంఎల్ఏ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి అమ్మవారికి సారెను సమర్పించారు. గ్రామానికి చేరుకున్న ఆమెకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు మేళతాళాలు, మంగళవాయిధ్యాలతో ఘన స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు సాయి ప్రసాద్ రెడ్డి ఇంటి నుండి సారెను గ్రామవీధులలో మోసుకుని వెళ్ళి అమ్మవారి ఆలయ పూజారికి అందజేశారు. గ్రామపెద్దలు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్ధప్రసాదాలు పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు జనార్ధన్ చౌదరి, రావిళ్ళ గిరి, వసంత నాయుడు, కిషోర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, మునికృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నడివీధి గంగమ్మకు భూమన సారె

రామచంద్రాపురం, మే 29 ప్రభాతవార్త:



నడవలూరులో జరిగిన నడివీధి గంగమ్మ జాతరను పురస్కరించుకుని గురువారం వైసిపి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి సంయుక్తంగా అమ్మవారికి సారెను సమర్పించారు. గ్రామానికి చేరుకున్న ఇరువురికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. మేళతాళాలు మంగళ వాయిధ్యాల నడుమ గ్రామవీధులలో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పూజారికి సారెను సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి వారికి తీరన్ధప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి జడ్పీటిసి ఢిల్లీరాణి, సర్పంచ్ గణపతి రెడ్డి, నాయకులు యోగానందరెడ్డి, సతీష్ రెడ్డి, దశరధ రెడ్డి, పవన్కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## "మహానాడు"కు తరలిన "దేశం"నేతలు





**తిరుపతి,మే 29ప్రభాతవార్త:**

తెలుగుదేశంపార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా కడపలో నిర్వహించిన మూడురోజుల మహానాడు సభకు గురువారం ఉదయం తిరుపతినుండి పెద్దసంఖ్యలో తెలుగుతమ్ముళ్ళు తరలివెళ్ళారు. మాజీఎమ్మెల్యే,రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్పర్సన్ సుగుణమ్మ నేతృత్వంలో తెలుగుయువత రాష్ట్ర అధికారప్రతినిధి కంకణాల రజినీకాంత్నాయుడు సమక్షంలో పుష్పావతియాదవ్, సూరాసుధాకర్రెడ్డి, బుల్లెట్రమణ, బ్యాంకు శాంతమ్మ, సింధూజ, దంపూరిభాస్కర్యాదవ్, వట్టికుంట శంకరనారాయణ, లక్ష్మీపతినాయుడు, సదాశివం, కుమారమ్మ తదితరులు భారీగా వెళ్ళారు.ఈ బస్సులను గురువారం ఉదయం సుగుణమ్మ జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతి నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా టిడిపి తిరుపతి అభివృద్ధికి సహకరిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో యువమంత్రి నారాలోకేశ్ సమర్ధవంతమైన పాలనలో అంతా మంచిజరుగుతుందని తెలిపారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మూడు నెలల గడువు పెంపు

– జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, మే 29 ప్రభాతవార్త ః



ఏపీ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలల పాటు జూన్ 1, 2025 నుంచి ఆగష్టు 31 , 2025 వరకు కొత్త కార్డుల ప్రక్రియ చేయడం గానీ, ఏదీ ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాను శుక్లా గురువారం నాడు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మే 31, 2025 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే జూన్ 1, 2025 నుంచి ఆగష్టు 2025 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని సంబంధిత మీడియా యాజమాన్యాల వారు వారి సంస్థల్లో పనిచేయుచున్న జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి, తిరుపతి వారి కార్యాలయంలో వీలైనంత తొందరగా అందజేయాలని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

## మహానాడుకు బయలుదేరిన పసుపు దండు

రేణిగుంట, మే 29 ప్రభాతవార్త



ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట పట్టణం ఎన్టీఆర్ విగ్రహం నుండి గురువారం తెలుగు తమ్ముళ్ల కడపలో జరిగే మహానాడు బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు. వారు బయలుదేరుతున్న వాహనానికి రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కీర్తిశేషులు నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెలుగువారి ఆత్మగౌరాన్ని కాపాడిందన్నారు. వీరంతా తెలుగుదేశం పార్టీ జిందాబాద్, ఎన్టీఆర్ జోహార్, చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, బొజ్జల సుధీర్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ బయలుదేరారు. మహానాడు బహిరంగ సభకు వెళ్లిన వారిలో తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్య రెడ్డి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు ఉన్నారు.

# తిరుపతి డివిజన్

## అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి.

– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి విద్య మే 29 ప్రభాత వార్త



అభంశుభం తెలియని చిన్నారులపై అత్యాచారాలు చేసే వారిని అత్యంత కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. వైఎస్సార్ కడప జిల్లా కంబాలదిన్నెలో మూడేళ్ళ చిన్నారిపై అత్యాచారం సొంత బంధువే చేయడం ప్రజలందరితోపాటు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ను ఎంతో కలిచి వేసిందని తన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో చెప్పారు.2018లో జమ్మూకాశ్మీర్ లోని కతువాలో ఎనిదేళ్ళ చిన్నారి ఆసిపా భానును అత్యంతదారుణంగా అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటనపై పవన్ కళ్యాణ్ పోరాడి నిరసన వ్యక్తం చేసిన సంగతిని ఆయన గుర్తు చేశారు.అయినా దేశంలో,రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటుండటానికి శిక్షల పట్ల భయం లేకుండా పోతుండటమే కారణమనే భావన వ్యక్తమౌతోందని ఆయన చెప్పారు.పోక్స్ చట్టం అమలులో ఉన్నా మైనర్లపై అత్యాచారాలు జరగుతుండటం బాధాకరమని ఆయన తెలిపారు.అందుకే రాష్ట్రంలో ఎవరైనా సరే అత్యాచారానికి పాల్పడాలంటే వణుకుపుట్టేలా కఠిన శిక్ష పడేలా పోలీసులు, న్యాయా శాఖ పని చేయాలని ఆయన కోరారు.తల్లితండ్రులతోపాటు స్కూల్స్ నూ చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ఏదో నెర్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజా రెడ్డి,ఆర్కాట్ కృష్ణప్రసాద్,అనీల్ రాయల్,బాలిశెట్టి కిషోర్, పగడాల మురళీ, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చక్రవర్తిని సన్మానించిన జనసేననేతలు

తిరుపతి(రవాణ),మే 29ప్రభాతవార్త



తిరుమలకు విచ్చేసి తిరుగుప్రయాణంలో జనసేన అధినేత,రాష్ట్ర డిసిఎం పవన్కల్యాణ్ వ్యక్తిగత కార్య దర్శి చక్రవర్తిని గురువారం తిరుపతిలో జనసేననేతలు కలిశారు. నగర అధ్యక్షుడు రాజారెడ్డి, కమిటీ నిర్వాహ కులు పగడాల మురళి,, సుమన్బాబు,పవన్కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించడం జరిగింది

## ప్రభుత్వ స్కిల్హబ్లో ఉచిత శిక్షణ

తిరుపతి(రవాణ),మే 29ప్రభాతవార్త

ఆంద్రప్రదేశ్రాష్ట్ర నైపుణ్యాభివృద్ది సంస్థ తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రభుత్వ స్కిల్ హబ్లోఉచిత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేయడం జరిగింది.ఈ స్కిల్ హబ్లో 10వ తరగతి విద్యార్హతతో ,15నుండి 45ఏళ్లలోపు వాళ్ళు సాఫ్టవేర్ప్రోగ్రామర్గా శిక్షణ పొందవచ్చని హబ్కోఆర్డినేటర్ దిలీప్ తెలిపారు. 8143576866నంబర్ను ఆసక్తి కలిగిన వాళ్ళు తమ వివరాలను తెలిపిన లింక్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.హెచ్టిటిపిఎస్://ఫామ్స్.జిఎల్ఇ/5ఐఎస్కెసిడిబి ఉజాఎక్స్ఎల్4హెచ్79. శిక్షణ ఉపాదిఅవకాశాలు ఉంటాయి.

## యస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పలు కోర్సులకు ఎన్.బి.ఏ గుర్తింపు

తిరుపతి విద్య మే 29 ప్రభాతవార్త



శ్రీ వేంకటేశ్వర వర్సిటీలో అంతర్భాగంగా వున్న శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలోని పలు కోర్సులకు న్యూఢిల్లీలోని మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ సంస్థ గుర్తింపును అందించింది.యస్వీయూలో ఇంజనీరింగ్ కళాశాలను మే నెల 7,8,9 తేదీలలో ఎన్.బి.ఏ. బృందం పరిశీలించింది. విశ్వవిద్యాలయం నిర్వహించే సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్,కమ్యూనికేషన్స్ అండ్ మెకానికల్,ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాలను సందర్శించింది.ఈ ఐదు శాఖలకు 2025 నుండి 2028 వరకు మూడు సంవత్సరాలు అనుమతి ఇచ్చింది. శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ఈ ఐదు కోర్సులను ఎన్.బి.ఏ.కమిటీ ముందు పెట్టింది.ఆయాశాఖల్లో బోధన,విద్యార్థుల పరీక్షా ఫలితాలు,అవస్థాపన సౌకర్యాలు వంటి వాటిని ఆధారంగా చేసుకుని ఈ గుర్తింపునిచ్చారు.నిన్న ప్రకటించిన జాబితాలో యస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్.బి.ఏ. గుర్తింపు రావడం పట్ల యస్వీయూ ఉపకులపతి ఆచార్య చిప్పాడ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు.ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. శ్రీనివాసులును,కోఆర్డినేటర్ ఆచార్య వెంకట రామయ్య,డీన్,ఆచార్య దామోదర్ రెడ్డి,ఆచార్య రమాశ్రీ,అధ్యాపక సిబ్బందిని వారు అభినందించారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి

చంద్రగిరి, మే 29 ప్రభాతవార్త:



కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నాగయ్యగారి పల్లి వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. మండల పరిధిలోని బందార్లపల్లికి చెందిన లోకేష్ (33) తన వ్యక్తిగత పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా నాగయ్యగారి పల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన లోకేష్ను ఆటోలో స్విమ్స్కు తరలించారు. ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతూ గురువారం వేకువజామున తుదిశ్వాస విడిచాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆలయంలో అంతర్గత బదలీలు

శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇద్దరు ఉద్యోగులను బదలి చేస్తూ ఇఓ డి.బాపిరెడ్డి ఉత్తర్వులు జారి చేసారు.అయితే ఈ బదలీల వెనుక ఆంతర్యమేమిటో ఎవ్వరికి అర్థం కావటం లేదు. ఇద్దరినే బదిలి చేయటంలో రాజకీయ వత్తిడులు ఏమైనా చోటు చేసుకున్నాయా? అనే చర్చ జరుగుతుంది. శ్రీకాళహస్తీశ్వరాలయ ఇన్స్పెక్టర్గా పని చేస్తున్న హరియాదవ్ను ప్రసాదాల పోటు,రాహుకేతుదోష నివారణ పూజల సామగ్రి ప్యాకింగ్ పర్యవేక్షణకు బదిలి చేసారు. కాగా అక్కడ పని చేస్తున్న వెంకటస్వామిని టెంపుల్ ఇన్స్పెక్టర్గా బదిలి చేసారు.

## వృద్ధాశ్రమంలో వృద్దులకు ఒత్తిడి నివారణపై అవగాహన

– సహబంతి భోజనానికి ఇంపాక్ట్ రీజనల్ ప్రెసిడెంట్ తహ సున్నీసా భేగం శ్రీకారం

తిరుపతి కలెక్టరేట్, మే 29 ప్రభాతవార్త ః



ఇంపాక్ట్ ట్రైనర్లు అశ్వినీరెడ్డి, కుమార్ అధ్యక్షతన చంద్రగిరి ప్రకృతి క్యూర్ హోల్డేజ్ హోమ్ వృద్ధాశ్రమంలోని వృద్దులకు ఒత్తిడి నివారణపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంపాక్ట్ రీజనల్ ప్రెసిడెంట్, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, ఛైర్మన్, ప్రముఖ యోగా గురువు తహ సున్నీసా భేగం హాజరయ్యారు. వృద్ధులకు ఒత్తిడిని ఏవిధంగా ఎదుర్కోవాలి, ఆరోగ్యాన్ని ఏవిధంగా కాపాడుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు వారి మనస్సులను మరింత ఉల్లాసపరచేందుకు వారితో తహ సున్నీసా భేగం, ఇంపాక్ట్ మెంబర్లు సహబంతి భోజనాలు చేశారు. దీంతో వృద్ధులు, వృద్ధాశ్రయ యాజమాన్యం తహసున్నీసా భేగం ఇలాంటి వినూత్న శ్రీకారం చుట్టడంపై ఆమెను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ మెంబర్లు, రాహుల్, వృద్ధులు, యాజమాన్యం పాల్గొన్నారు.

## వెలుగు కార్యాలయంలో కొనసాగుతున్న టైలరింగ్ శిక్షణ

సత్యవేడు, మే 29 ప్రభాతవార్త:



సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ(వెలుగు) కార్యాలయంలో టైలరింగ్శిక్షణ కొనసాగుతోంది. టైలరింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికి మే 1 నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మండల పరిషత్ విస్తరణ అధికారి తరుణాక్షరెడ్డి, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్, కో–ఆర్డినేటర్ పయణి తదితరులు టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి శిక్షణ స్థితిగతులను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి బ్యాంచికి సంబంధించి 70 మంది హాజరు కావలసి ఉండగా 38 మంది, మధ్యాహ్నం 1 గంట నుంచి 4 వరకు రెండో బ్యాచి 70 మంది గాను 60 మంది హాజరవుతున్నట్లు టైలరింగ్డేటా ఎంట్రీ ఆపరేటర్ పునీత పేర్కొన్నారు. వీరందరికి దుస్తులు కట్ చేయడం, వాటిని టైలరింగ్ మిషన్ ద్వారా కుట్టడం వంటి పనులకు సంబంధించి టైలరింగ్ శిక్షకులు రోజారమణి నేర్పుతున్నారు.కార్యక్రమంలో టైలరింగ్ మహిళల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అరక్కోణంలోజరిగిన రైల్వే ఎంప్లాయిస్ రిటైర్డ్మెంట్ ఫంక్షన్లో పాల్గొన్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు రూరల్, మే 29 ప్రభాతవార్త: తమిళనాడులోని అరక్కోణంలో రైల్వే ఇంజనీరింగ్ వర్క్షాపులో పని చేసి రిటైర్ అవుతున్న ఇంజనీర్లకు వీడ్కోలు, అభినందనలు సభ గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ మాజీ మంత్రి రోజా పాల్గొని రిటైర్ అవుతున్న ఇంజనీర్లకు ఆమె జ్ఞాపికలను అందజేసి, శాలువలతోసత్కరించి వారి సుదీర్ఘ సేవలకు అభినందిస్తూ వారి శేషజీవితం సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం రైల్వే ఎంప్లాయిస్, అధికారులు రోజాను సత్కరించి, తమను అభినందించడానికి వచ్చినందుకు సభాముఖంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



కేంద్రమంత్రి మురుగన్కు
బి జె పి నేత గుండాల గోపినాద్ రెడ్డి
ఆత్మీయ స్వాగతం

ప్రభాతవార్త.....
తిరుపతి


కెనరా బ్యాంక్ Canara Bank — సత్యవేడు శాఖ, సత్యవేడు, తిరుపతి జిల్లా

**రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు తేది: 22.05.2025

**రుణగ్రహీత:శ్రీ అమల్ వర్గీస్** తండ్రి కనీపార్త్ ఆంటోని ఎ., పాత ఎంఆర్ఓ ఆఫీస్ వీధి, తడ, తిరుపతి – 524401

**హామీదారు: శ్రీ అఖిల్ ఆంటోని** తండ్రి అఖిల్ ఆంటోని అగస్టీన్, పాత ఎంఆర్ఓ ఆఫీస్ వీధి, తడ, తిరుపతి – 524401

అయ్యా/ అమ్మా !

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు మా కెనరాబ్యాంక్, సత్యవేడు శాఖ, నుండి మీరు శ్రీ అమల్ వర్గీస్ తండ్రి కనీపార్త్ ఆంటోని ఎ. గారు కాలానుగుణంగా పొందిన లోన్/ రుణ సౌకర్యాల వివరములు

| రుణ స్వభావం | రుణం మొత్తం & ఖాతా నెంబరు | తేది: 30.04.2025 నాటికి బకాయిమొత్తం | వడ్డీ రేటు |
|---|---|---|---|
| హౌసింగ్ లోన్ | రూ.10,00,000/- 31899740000010 | రూ.15,91,002.15 | 11.10% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసు షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో విఫలమైనందున బ్యాంకు సదరు ఋణాన్ని **తేది: 30.01.2001** నిరర్థక ఆస్తిగా (ఎన్పిఏగా) వర్గీకరించినది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.15,91,002.15 (పదహైదు లక్షల తొంభై ఒక్క వేల రెండు రూపాయల పదహైదు పైసలు మాత్రమే)** లను + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసును జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కులను మేము వినియోగించుకుంటాము. అంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించడకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు / లేదా అమలులో వున్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కులకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించు కోగలరని సూచించడమైనది. మా శాఖ రికార్డులలో అందుబాటులో వున్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగినది.

**షెడ్యూలు: తనఖాలో వున్న ఆస్తి యొక్క వివరములు దిగువ తెలుపబడినవి.**

శ్రీ పొట్టిశ్రీరాములునెల్లూరు జిల్లా, తడ గ్రామ పంచాయతీ & మండలం, తడ కండ్రిగ గ్రామం, చెంగాలమ్మ నగర్, నేషనల్ హైవే 5కు తూర్పు వైపు, సర్వేనెం.114/4ఎ లోని ప్లాటు నెం.38 లో నిర్మించిన కె.కె.వి అవెన్యూ, 2వ అంతస్తులోని నివాసయోగ్యమైన ఫ్లాట్ నెం.301 యొక్క పూర్తి విస్తీర్ణం 234.24 చ.గ. ఇందులో అవిభాజ్యవాటా విస్తీర్ణం 16.73 చ.గ. ఫ్లాట్కు హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఫ్లాట్ నెం.302, పడమర: జాయింట్ మెట్లు & కారిడార్, ఉత్తరం: ఓపెన్ టు స్కై, స్థలానికి హద్దులు: తూర్పు: లేఅవుట్ ఫెన్సింగ్, దక్షిణం: 23అ. వెడల్పు గల లేఅవుట్ రోడ్డు, పడమర: ప్లాటు నెం.37లోని ఖాళీ స్థలం, ఉత్తరం: లేఅవుట్ ఫెన్సింగ్ **టైటిల్ హోల్డర్ పేరు: శ్రీ అమల్ వర్గీస్ తండ్రి కనీపార్త ఆంటోని ఎ.**

స్థలం : సత్యవేడు — సం// అధీకృత అధికారి,
తేది: : 22.05.2025 — కెనరా బ్యాంక్

# ప్రాథమిక దశలో గుర్తిస్తే... క్యాన్సర్ నివారణ సాధ్యం



బాలాయపల్లి, మే 29 ప్రభాతవార్త : ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నివారణ సాధ్యమవు తుందని బాలాయపల్లి వైద్యాధికారి డాక్టర్ లియోన తెలిపారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో గురువారం బాలాయపల్లి పిహెచ్‌సి పరిధిలోని నిండలి, గొట్టికాడు గ్రామాల్లో పింక్ బస్సుల ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. పింక్ బస్సుల క్యాంపులు జరిగే తేదీలను ప్రకటించారు. 2న జయంపు, పెరిమిడి, 3న కామకూరు, పిగిలం, 5న కాట్రగుంట, ఊట్లపల్లి. 6న కయ్యూరు, వి.ఎం.పురం, 9న కోటంబేడులో స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హరిత, డాక్టర్ చైతన్య భాను, సర్పంచులు కృష్ణయ్య, సుప్రజ, పంచాయతీ కార్యదర్శులు దయాకర్, మోలా, స్థానిక నాయకులు మీరారెడ్డి, శేఖర్, గోపీకృష్ణారెడ్డి, సిహెచ్‌ఓ బి.నీరజ, సూపర్వైజర్ టివి.నరసింహారావు, ఎంఎల్ హెచ్ పిలు ఎ.నాగరవళి, సి.భానుప్రియ, ఏఎన్ఎంలు జి.వసుంధర, సుబ్బమ్మ, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహానాడుకు తరలివెళ్లిన కోట నాయకులు

కోట, మే 29 ప్రభాతవార్త: కడపలో జరుగుతున్న మహానాడు సంబరాలకు గురువారం కోట మండలం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. టిడిపి బిసిసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు తన అనుచరులతో కలిసి వెళ్లారు.అదేవిధంగా రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి పలగాటి భాస్కర్‌రెడ్డి, జితేంద్రరెడ్డి, మర్రి పోలయ్య,నాయకులు కడపకు బయలుదేరి వెళ్లారు.

**తేనెటీగల దాడిలో పదిమందికి గాయాలు:**

కోట క్రాస్ రోడ్డు, ఆర్టీసీ మార్గంలో బజాజ్ బైక్ షోరూం సమీపంలో శేషాద్రి లేఅవుట్ ఎదురుగా తేనెటీగలు దాడి చేయడంతో పదిమంది గాయపడ్డారు. ఆ మార్గంలో ఉన్న భారీ వృక్షానికి తేనెటీగ తుట్టె ఉంది. గాలులు వీయడంతో ఒక్కసారిగా తేనెటీగలు లేచి ప్రయాణికులపై దాడి చేశాయి. ఒక్కసారిగా తేనెటీగలు ఆ ప్రాంతంలోకి రావడంతో పాదచారులు భయభ్రాంతులకు గురయ్యారు. తేనెటీగల వలన పదిమంది వరకు గాయపడ్డారు. కోట ఆసుపత్రిలో చికిత్స పొందారు.

## విద్యార్థి మిత్ర కిట్లు వచ్చేశాయ్

కోట, మే 29 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందజేసే విద్యార్థి మిత్ర కిట్లు వచ్చేశాయ్. వీటిపై గత ప్రభుత్వం రాజకీయ ప్రచార ఆర్భాటం చేసింది. జగనన్న విద్యాకానుక పేరిట గత ఏడాది ప్రభుత్వం అందజేసింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాజకీయ నాయకుల పేర్లు లేకుండా వీటిని తీసుకొచ్చింది. ఉపాధ్యాయుడిగా పనిచేసి రాష్ట్రపతి పదవి అలంకరించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు మీద విద్యార్థి మిత్రగా పేరుపెట్టి కిట్లు అందజేయడానికి సిద్ధం చేశారు. కోట మండలంలో ఇప్పటికే 90 శాతం మేరకు కిట్లు అందాయి. ఏకరూప దుస్తులు, స్కూల్ బ్యాగ్, బెల్టులు, నిఘంటువులు, బూట్లు, టై, రాత పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను పాఠశాల పునఃప్రారంభం లోపే అందజేస్తామని ఎంఇఓ దారా మస్తానయ్య చెప్పారు.

## ఇంటింటా సరఫరాకు రేషన్ బ్రేక్

**-ఒకటి నుంచి రేషన్ డీలర్లకు మళ్లీ పగ్గాలు -దీంట్లో ఎండియు వాహనాల ఆపరేటర్లు ఆందోళన**

దొరవారి సత్రం, మే 29ప్రభాతవార్త: గత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఇంటింటా రేషన్ బియ్యం సరఫరాకు బ్రేక్ పడింది గత 20 రోజుల నుండి ప్రతి గ్రామంలో ఉన్న చౌక దుకాణాల వద్దకు అధికారులు వస్తూ మళ్లీ రేషన్ డీలర్లకి రేషన్ బియ్యం వేసే సరఫరాను అందిస్తున్నారు. దీంతో ప్రతి ఇంటింటా తిరిగే ఎండియు వాహన ఆపరేటర్లు వారి బతుకు జీవితం పోయిందంటూ లబో దిబో కొట్టుకుంటున్నారు. తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలం పరిధిలో 22 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలో 41 రేషన్ డీలర్ షాపులు ఉన్నాయి, అయితే ఈ రేషన్ షాపు నుండి ఎండియు వాహనాల ద్వారా గ్రామంలో ప్రతి ఇంటింటికి రేషన్ బియ్యంను అందిస్తుండేవారు. కాని ప్రస్తుతం ఈ ఎండియు వాహనాలను ప్రభుత్వం ఆపివేసి మరల రేషన్ డీలర్ల ద్వారానే రేషన్ బియ్యాన్ని అందించుటకు స్వీకారం చుట్టారు.

## మహానాడుకు పెళ్లకూరు తెలుగు తమ్ముళ్లు



పెళ్లకూరు, మే 29 ప్రభాతవార్త : కడపలో మూడు రోజుల నుంచి జరుగుతున్న తెలుగు తమ్ముళ్ల పసుపు పండగ మహానాడుకు పెళ్లకూరు మండలం నుంచి మండల నాయకులు కార్యకర్తలు తెదేపా అధ్యక్షులు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో బయలుదేరారు గురువారం ఉదయం 8 గంటలకు 71 వ నెంబర్ జాతీయ రహదారిపై నేలపల్లి వద్ద నుంచి పది కార్లు ఐదు బస్సులలో సుమారు 400 మంది కార్యకర్తలు నాయకులు కోలాహలంగా ఆనందోత్సాహాల మధ్య పసుపు కండువాలు ధరించి జెండాలు చేతబట్టి జైచంద్రబాబు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా బయలుదేరారు. ఈ ర్యాలీని మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య జండా ఊపి ప్రారంభించారు.

## మహానాడు కార్యక్రమం విజయవంతం : ఎమ్మెల్యే



వెంకటగిరి, మే 29 ప్రభాతవార్త : కడపలో జరిగిన మహానాడు కార్యక్రమం విజయవంతంగా జరిగిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే రామకృష్ణ ఆధ్వర్యంలో కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి భారీగా పార్టీ కార్యకర్తలు నాయకులు తరలి వెళ్లారు. వెంకటగిరి పట్టణ రాపూర్ రోడ్డు వద్ద మహానాడుకు వెళ్లే పార్టీ కార్యకర్తలు నాయకులు వాహనాలను ఎమ్మెల్యే రామకృష్ణ జండా ఊపి తరలించారు. ఐదువందల మంది బస్సులో కారులలో కడపలో జరిగే బహిరంగ సభకు తరలి వెళ్లారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు నాయకులు వెళ్ళినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమోళి రెడ్డి, మాజీ పట్టణ పార్టీ అధ్యక్షుడు ముంక్ ఆనంద్, మాజీ సొసైటీ అధ్యక్షుడు వెంకట ముని తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికులకు మెరుగైన వసతులు



వెంకటగిరి, మే 29 ప్రభాతవార్త : ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు సంస్థ చేపిందిని వెంకటరమణ తెలిపారు. వెంకటగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయన ప్రయాణికులకు ఏర్పాటు చేయాల్సిన వసతులపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు బస్టాండ్లలో మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు. ఫ్యాన్ బిగించడం, రంగులు వేయడం, కుర్చీలు కొత్త వేయించడం వంటి పనులు చేపడతామని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చెన్నకేశవరావు, డిపో మేనేజర్ రామకృష్ణ, ఏఈ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదం కేసులో ఆటో డ్రైవర్‌కి జైలు శిక్ష

బాలాయపల్లి, మే 29 ప్రభాతవార్త : తొమ్మిది సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌కి నేరం రుజువుకావడంతో గురువారం రోజున జైలు శిక్ష పడింది. బాలాయపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలాయపల్లి మండలం చిలమనూరు హరిజనవాడకు చెందిన బత్తల మహేశ్వరయ్య 2016వ సంవత్సరంలో గొల్లగుంట గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ రోడ్డు ప్రమాదానికి కారణమైన నాయుడుపేట మండలం మాబాక గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మోడే హరికృష్ణ పై బాలాయపల్లి పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జ్ షీట్ ఫైల్ చేశారు. గురువారం ఈ కేసుపై వాదోపవాదాలు జరిగాయి. కేసు రుజువు కావడంతో వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్. విష్ణువర్మ ముద్దాయికి 18 నెలలు జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించారని బాలాయపల్లి ఎస్ఐ కె.గోపి తెలిపారు.

## డిలర్లు పారదర్శకంగా సేవలు అందించాలి



కోట,మే 29 ప్రభాతవార్త : జూన్ 1 నుంచి చౌకదు కాణాల నుంచి ప్రజలకు బియ్యం,చక్కర, కందిపప్పు తదితర వస్తువులను డిలర్లు ద్వారానే పంపిణీ చేయాల్సి వస్తోందిని కోట మండల తహశీల్దార్, జయజయరావు చెప్పారు. ఆమేరకు గురువారం మండలంలోని జరుగుమల్లి, వెంకన్నపాళెం, వంజివాక తిన్నెలపూడి తదితర గ్రామాల్లోని డిలర్లు అవగాహన కల్పించారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్, మల్లిఖార్జున్‌రావు ఉన్నారు.

## వాతావరణాన్ని కలుషితం చేస్తున్న రిలాక్స్‌వెల్ మాట్రిస్

**-మాట్రిస్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ -రిలాక్స్‌వెల్ మాట్రిస్‌కు జరిమానకు ఆదేశించిన కలెక్టర్**




తిరుపతిరూరల్, మే29 ప్రభాతవార్త: తిరుపతి హైవే రోడ్డు, గాంధీపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రిలాక్స్‌వెల్ మాట్రిసెస్ పరిశ్రమ యాజమాన్యంపై కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సీరియస్ అయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను కాలుస్తూ వాతావరణాన్ని కాలుస్తూ వాతావరణాన్ని కలుషితం చేస్తున్న రిలాక్స్‌వెల్ పరిశ్రమ యాజమాన్యంపై కలెక్టర్ జరిమానకు ఆదేశించారు. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుండి నోటీసులు జారీ చేసారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీ పరిధిలో, హైవే రోడ్డుపై ఉన్న రిలాక్స్‌వెల్ మాట్రిసెస్ వ్యర్థాలను రోడ్డు పక్కనవేసి కాల్చుడాన్ని అటువైపు వెళ్ళుతున్న జిల్లా కలెక్టర్ గమనించారు. వ్యర్థాలను కాల్చడం ద్వారా వెలువడే పొగతో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తనున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన మాట్రిసెస్ పరిశ్రమ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని, జరిమాన విధించమని జిల్లా పంచాయతీ అధికారిణికి కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ దగ్గరుండి వ్యర్థాలను మంటలను ఆర్పించారు. హైవే రోడ్డు పక్కన నిబంధనలకు విరుద్ధంగా చెత్తవేయడం, కాల్చడం నేరమని, ఇక మీదట ఇటువంటి చర్యలకు పాల్పడితే పంచాయతీ చట్టం సెక్షన్స్ 84,94 మేరకు భారీ జరిమాన విధించడం జరుగుతుందని తెలిపారు. సెక్షన్ 127 మేరకు వ్యాపార లావాదేవీలకు సంబంధించిన లైసెన్స్‌లు రద్దు చేయబడతాయని కలెక్టర్ హెచ్చరించారు. భవన నిర్మాణ వ్యర్థాలు, వ్యాపార కట్టడాలు నిర్మించే వాళ్ళు, నిర్మాణ సమయంలో వచ్చే వ్యర్థాలను సక్రమంగా అనుమతి పొందిన ప్రదేశాలలో మాత్రమే పారవేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో భవన నిర్మాణానికి సంబంధించిన వ్యర్థాలను పడవేసిన ఎడల జరిమానాలు విధించబడునని, భవన నిర్మాణ అనుమతులు రద్దు చేయబడతాయని తెలిపారు. వైవే రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా రిలాక్స్‌వెల్ మాట్రిసెస్ పరిశ్రమ వ్యర్థాలను కాల్చి, వాతావరణాన్ని కలుషితం చేసిన మాట్రిసెస్ యాజమాన్యానికి జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి రూ.50,000 రుపాయాల జరిమాన విధించారు.

## హస్త కళాకారులకు మూడు సెంట్లు భూమి : కలెక్టర్



శ్రీకాళహస్తి రూరల్,మే 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండల కేంద్రానికి సమీపంలోని మాధవ మాలలో ఏర్పాటు చేసిన హస్తకళల కలంకారి క్లస్టర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడ కళాకారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి సాధక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. కొయ్య బొమ్మల తయారికి సంబంధించి గుమ్మడి దశరథాచ్చారి, కలంకారి కళకు సంబంధించి పాలూరు పద్మావతి కలెక్టర్‌కు వివరించారు. కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

**హ్యాండీ క్రాఫ్ట్ హబ్‌గా మాధవమాలు:**

కళాకారులతో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ ఏర్పేడు మండల కేంద్రానికి సమీపంలోని మాధవమాల వద్ద ఏర్పాటు చేసిన హస్తకళాకారుల ఒకేంద్రాన్ని ప్రత్యేక హబ్‌గా తీర్చి దిద్దనున్నట్లు కలెక్టర్ వివరించారు. దారుశిల్పులకు, కలంకారి కళాకారులకు వరాలు జల్లు కురిపించిన కలెక్టర్ వెంకటేశ్వరన్ రాబోవు రోజుల్లో నిరుపేదలైన కళాకారులకు ఒక్కొక్కరికి ఇళ్ళనిర్మాణానికి సంబందించి మూడు సెంట్లు భూమి కేటాయిస్తామని కలెక్టర్ కళాకారుల హర్షధ్వనాల మధ్య ప్రకటించారు. త్వరలో హస్తకళ కళాకారులతో బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వరన్ తెలిపారు. కాగా కళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలేనందువల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించగా స్పందించిన కలెక్టర్ తితి దేవస్థానం ఇఓతో చర్చిస్తామని రేణిగుంట ఎయిర్ పోర్టు అధికారులతో చర్చించి సాధ్యమైనంత త్వరలో షాపుల ఏర్పాటుకు అనుమతి సాధిస్తామని వివరించారు. ప్రభుత్వం పరంగా ప్రకటిస్తున్న అన్ని సదుపాయాల్ని అందిస్తామన్నారు. ఈ సమావేశంలో కళాకారుల ప్రతినిధులతో పాటు శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, డిఆర్‌డిఏ పిడి శోభన్‌బాబు, డిఆర్‌డిఏఏ పిడి పి.ప్రభావతి, జిల్లా జీవనో పాధులు అధికారి టి.ధనంజయరెడ్డి, తహశీల్దార్ భార్గవి, ఎంపిడిఓ సౌభాగ్యం, గ్రామసర్పంచ్ కరిముల్లా, ఏరియాకోఆర్డినేటర్ వనజాక్షి, ఎస్విఈసి ఎపిఎం దూర్వాసులు నాయుడు ఎపి ఎం కోమల, హస్తకళల కార్యదర్శి దశరథాచ్చారి, శ్రీ బాలాజి ఉడ్‌క్వారింగ్ ఆర్టిజన్ మ్యూచువల్ ఎయిర్ కోఆపరేటివ్ సొసైటి లిమిటెడ్ అధ్యక్షులు టి.లోకనాథ ఆచారి, కార్యదర్శి రాజాచారి, సిఇఓ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మూడో రోజు శాస్త్రసోక్తంగా మహాకుంభాభిషేకం పూజలు



కాణిపాకం, మే 29 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం జీర్ణోద్ధారణ, అష్టబంధనం, మహాసంప్రోక్షణ(మహా కుంభాభిషేకం) కార్యక్రమం పూజలు మూడో రోజు గురువారం శాసోక్తంగా కొనసాగాయి. కాణిపాకం ప్రధాన ఆలయ ప్రాంగణంలో సుమారు 1.10 కోట్లు రూపాయల వ్యయ అంచనాలో దాత అమెరికాకు చెందిన ప్రవాసాంధ్రుడు మల్లవరపు అనిల్ రాతి కట్టడంతో నూతన శ్రీవీరాంజనేయస్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తికావడంతో ఈనెల 30న మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈమేరకు కుంభాభిషేకం పూజలు ఈనెల 27న సాయంత్రం ఘనంగా ప్రారంభం కాగా మూడో రోజు కూడా అర్చకులు, రుత్వికులు వేదపండితుల మత్రోచ్చారణ నడుమ కొనసాగాయి. ఈమేరకు గురువారం ఉదయం అవివాహిత దేవతారాధన, హోమములు, హనుమత్ సహస్రనామహోమములు, వేదాది పారాయణములు, లఘు పూర్ణాహుతి, శాత్తుమొర, తీర్థ ప్రసాద వినయోగము, ఆశీర్వచనము వంటి పూజాధి కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే సాయంత్రం 5.30 గంటలకు అవివాత దేవతారాధన, హోమములు, వేదాది పారాయణములు, కళాప కర్షణము, మూర్తి హోమము, జీవాది తత్వన్యాస హోము, శయనాధివాసము, తత్వస్పర్శ, లఘుపూర్ణాహుతి శాత్తుమొర, తీర్థ, ప్రసాద వినియోగము, ఆశీర్వచనము వంట పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ దాత అనిల్ కుటుంబసభ్యులు, ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి దంపతులు ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

## సైన్యం దేశానికి చేస్తున్న సేవలు అభినందనీయం : జిల్లా కలెక్టర్



రేణిగుంట మే 29 ప్రభాతవార్త : సైనికులు భారతదేశానికి చేస్తున్న సేవలు అభినందనీయమని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం జి పాలెం పంచాయితీ ఇండియన్ కలనరి ఇన్స్టిట్యూట్ నందు డైరెక్టర్ జనరల్ ఆఫ్ రీసెటిల్మెంట్ ట్రైనీల అవుట్ గోయింగ్ బ్యాచ్ కోసం గురువారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ముఖ్యతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ సిబ్బంది అందరికీ అభినందనీయులు, దేశ ప్రేమికులు, ప్రాణ రక్షకులు అన్నారు. వారికి హాస్పటాలిటీ, టూరిజం రంగంలో రెండవ కెరీర్ను కోరుకుంటున్నట్లు తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ రిసెటిల్మెంట్ లక్ష్యసాధనకు దోహదపడిన ఇండియన్ కలనరి ఇన్స్టిట్యూట్ కృషిని ప్రశంసించారు. మాజీ సైనికుని కుమారునిగా రక్షణ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇన్స్టిట్యూట్ లోని వంటశాలలు, ప్రయోగశాలలను సందర్శించిన అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కను నాటారు. డాక్టర్ ఎం తిరులోకచందర్ సంస్థ నందు అందించే కోర్సులు, వైద్యం, పర్యాటక రంగంలో విద్యార్థులకు కల్పించే అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ ప్రతినిధులు డాక్టర్ ఎం. డాక్టర్ తిరులోక చందర్, డాక్టర్ లోంటే దౌలత్ రావు, చెల్లేశ్వరరావు, విష్ణు ప్రియా దేవి, నిర్మల్ శర్మ, మధుసూదన్ రాజు, బాబు, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట తహసిల్దార్ సురేష్ బాబు, ఇన్స్టిట్యూట్ విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## భూ పోరాటయోధుడు కామ్రేడ్ జక్కా వెంకయ్య



గూడూరు, మే 29 ప్రభాతవార్త : గూడూరు లోని సిపిఎం పార్టీ కార్యాలయంలో గురువారం రోజు కామ్రేడ్ జక్కా వెంకయ్య ఏడవ వర్ధంతి ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఎం, సిఐటియు ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ఉద్యమ నిర్మాత, సారా, అక్షరాస్యత, ముందుండి నడిపించినటువంటి రథసారథి భూ పోరాటయోధుడు కామ్రేడ్ జక్కా వెంకయ్య అని కొని యాడడం జరిగింది. కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర వహించడం జరిగిందని, పేద బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా ప్రజల హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయిన పోరాట యోధుడన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సీనియర్ నాయకులు టి.వెంకటరామిరెడ్డి, సిఐటియు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, మున్సిపల్ సంఘం కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, పామంజి మణి, కెవిపిఎస్ ప్రసాద్, ఆర్. శ్రీనివాసులు, గండికోట మధు, వెంకటప్పయ్య, వై. సుబ్రహ్మణ్యం, ఆర్.మనోహర్, వై. నాగరాజు, ఎస్.కె. మహబూబ్ బాషా, ఎస్కె. మోలా, భాస్కర్ రెడ్డి, జి.మని, జి.వెంకటేశ్వర్లు, ఎస్కె చాన్ బాషా, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద నిర్మూలనకు పటి ష్టమైన చర్యలు చేపట్టాలి

**- సమైక్యతా యాత్రలలో సిపిఎం డిమాండ్**




గూడూరు, మే 29 ప్రభాతవార్త : ఉగ్రవాద నిర్మూలనకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, మతసామరస్యం దేశ సమగ్రత పరిరక్షణ కోరుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న సమైక్యత యాత్రలలో భాగంగా గూడూరు పట్టణంలో గురువారం రోజు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద నుండి బయలుదేరిన సమైక్యతా యాత్ర వివేకానంద రోడ్డు, ముత్యాల పేట, మీదుగా పాత బస్టాండు, టవర్ క్లాక్ సెంటర్, ఎన్టీఆర్ కాంప్లెక్స్, గాంధీ మున్సిపల్ మీదుగా దుకాణదారులకు, ప్రయాణికులకు, ప్రజలకు, కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ కొనసాగింది. ఈ ప్రదర్శనలో ఉగ్రవాదులు, మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టడం జరిగింది. ఆపరేషన్ సింధూర్ పేరుతో యుద్ధం ప్రకటించి ఉగ్రవాదులను అంతమొందించామని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెబుతున్నారని, ఇప్పటివరకు ఉగ్రవాదులు ఎక్కడ నుండి వచ్చారని ఎంతమందిని పట్టుకున్నామని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, నాయకులు బి.వి రమణయ్య, టి.వెంకటరామిరెడ్డి, పామంజి మణి, ఏ.ప్రసాద్, గండికోట మధు, ధారా. కోటేశ్వరరావు, ఎస్కె. మహబూబ్ బాషా, వై. సుబ్రహ్మణ్యం, ఆర్.శ్రీనివాసులు, బి.నారాయణ, వెంకటప్పయ్య, బి.చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మహానాడుకు తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు




ఓజిలి, మే 29 ప్రభాతవార్త : కడపలో జరిగిన మహానాడుకు సూళూరుపేట నియోజకవర్గం ఓజిలి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు గురు వారం తరలి వెళ్లారు. ఓజిలి, కురుగొండ, పున్నేపల్లి, పెదపరియ, వెంకటరెడ్డిపాళెం తదితర గ్రామాలకు చెందిన కార్యకర్తలతో తెలుగుదేశం పార్టీ నాయకులు మండల కన్వీనర్ విజయకుమార్ నాయుడు, కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు, బిసి నాయకులు పాడి వెంకట సుబ్బయ్య, డాక్టర్ దారా అంకయ్య, అనుబోలు రవిందర్‌రెడ్డి, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, సుబ్రమణ్యం రాజు తదితర నాయకులు కలిసి కార్లు, బస్సులలో మహానాడుకు బయలుదేరారు. తెలుగుదేశం పార్టీ మహానాడు పండుగలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని వ్యక్తం చేశారు. మహానాడుకు తరలిన వారిలో బిసి ప్రధాన కార్యదర్శి చేనీ వెంకటేష్, రఫీ, రవీందర్ రెడ్డి, ముమ్మడి సుధాకర్, కోటేశ్వరరావు యాదవ్, అట్ల మల్లికార్జున్ యాదవ్, జయ చంద్ర రెడ్డి, సూరి రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కలలు మింగిన అలలు

కోట,మే 29 ప్రభాతవార్త : చలాకీగా కళ్లెదుట ఆడుతూ పాడుతూ తిరిగే పిల్లలు వారు అమ్మానాన్నల ముద్దుల కూనలు.. ఆహ్లాదంగా అలరించే తీరం అందమే తప్ప సముద్రంలో లోపల సుడి గండాలు ఉంటాయని తెలియన అమాయకులు.. ఒక్క సారిగా చలనం లేని బొమ్మల్లా మారిపోవడంతో కన్న వారి గుండె కోత మిగిల్చారు. కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాససత్రంకు చెందిన లక్ష్మయ్య, సౌమ్మల కుమార్తె బుధవారం సముద్ర స్నానికి వెళ్లి ప్రమాదంతో మృతి చెందిన విషయం తెలిసిందే. పల్లవి మృత దేహం చూసిన తల్లిదండ్రులు తమ బిడ్డకు అప్పుడే పేగు బంధం తీరిపోయింద అంటే తల్లిదండ్రులు రోదనలు అందరినీ కలచి వేశాయి. ఇలా ఒకటి కాదు ఇటు కోట మండలం శ్రీనివాస్‌సత్రం బీచ్ వద్ద ఆటు వాకాడు మండలం తూపిలిపాళెం బీచ్ వద్ద కూడా ఏంతో మంది సముద్ర స్నానానికి వచ్చి విగతజీవులుగా మారిపోతున్నారు. ఇలా ఏన్ని ప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకొవడం లేదు. ప్రభుత్వం ఇలా ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకొవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుపతి(రవాణ),మే 29ప్రభాతవార్త : తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం 6.45గంటలకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో భాగంగా గోవిందరాజస్వామిసన్నిధితోబాటు ఆలయప్రాంగణంలోని ఇతర ఆలయాల గోడలు, పైకప్పు, పూజాసామాగ్రి, తదితర వస్తువులను నీటితో శుద్ధిచేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధంపొడి, కుంకుమ,.కిచిలీగడ్డతదితర సుగంద్రద్రవ్యాలు కలగలిపిన సంప్రోణాన్ని ఆలయం అంతటా ప్రోక్షణంచేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మునిక్రిష్ణారెడ్డి, ప్రదాన అర్చకులు ఏపి శ్రీనివాసదీక్షితులు, ఆలమ ఇన్‌స్పెక్టర్ ధనంజయ తదితరులు పాల్గొన్నారు. జూన్ 2నుండి 10వతేదీ వరకు గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

## కదలివెళ్ళిన టిడిపి బలగం



కడపలో జరిగిన మహానాడు చివరిరోజు బహిరంగ సభకు తిరుపతిపార్లమెంట్ నుండి భారీగా తెలుగు తమ్ముళ్ళు కదలివెళ్ళారు. నాయకులు నరసింహ యాదవ్, ఆర్‌సి మునికృష్ణ, ఆర్‌పి శ్రీనివాసులు, ఊకా విజయకుమార్, ఎస్వీఎం శ్రీధర్‌తో కలసి నాయకులు భారీగా వెళ్ళారు. -ప్రభాతవార్త-తిరుపతి

## శ్రీకాళహస్తి రాజకీయంలో చారిత్రాత్మకం: బొజ్జల



శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి రాజకీయంలో ఈ ఏడాది నిర్వహించిన తెలుగుదేశం మహానాడు చారిత్రాత్మకమని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పసుపు సైన్యం కడప గడపలో, చైతన్యం కల్గించారని అభిప్రాయపడ్డారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కంచుకోటగా ఉందన్నారు. నాడు శ్రీకాళహస్తిలో పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు బహిరంగ సభ నుంచి నేటి కడప మహానాడు వరకు పార్టీకి కార్యకర్తలే కాకుండా ప్రజలు కూడా బ్రహ్మరథం పడుతున్నారని సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శ్రీకాళహస్తి లో సుమారు 15 రోజులుగా మహానాడు సభలకు సంబంధించి సమీక్షలు, సమావేశాలు నిర్వహించామన్నారు. పార్టీ ఆదేశాల మేరకు మహానాడు లోపల మండల, పట్టణ కమిటీల నియామకం పూర్తి చేసినట్లు వివరించారు. దాంతో యువతలో నూతనోత్సహం చోటు చేసుకుందని వివరించారు.

**నాయకులకు ఘనస్వాగతం:**

కడప జిల్లాలోని దేవుని కడప పబ్బాపురంలో శ్రీకాళహస్తి నుంచి వచ్చిన తెలుగుదేశం కుటుంబసభ్యులకు శాసనసభ్యుడు బొజ్జల ఘనస్వాగతం పలికారు. గురువారం ఉదయం నుంచి నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లోనూ గ్రామాల్లో సంబరాలు చోటు చేసుకున్నాయి. ఆయా మండలాల్లో నాయకులు రావిళ్ళ మునిరాజానాయుడు, విజయకుమార్‌నాయుడు, ఆంక్షితల చంద్రయాదవ్, నాగరాజునాయుడు, చంద్రారెడ్డి సారథ్యంలో ప్రత్యేక బస్సుల్లో జనం కడపకు చేరుకున్నారు. 120 బస్సులు,150 కార్లలో సుమారు పదివేలకు పైగా కార్యకర్తలు కదలి వచ్చినట్లు వారికి తగిన ఏర్పాట్లు చేసినట్లు సుధీర్‌రెడ్డి వివరించారు. శ్రీకాళహస్తి నుంచి వచ్చిన వాహనాల పార్కింగ్‌కు సంబంధించి పోలీసు అధికారితో సమన్వయం చేశారు.